

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...



రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number 9059328777



విజయవాడ శుక్రవారం 14-08-2026 సంపుటి: 02 సంచిక : 42 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Friday, 14-08-2026 Volume :02 Issue: 42 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani




# పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

- కేంద్రానికి సుప్రీంకోర్టు గట్టి హెచ్చరిక
- చక్కెర, ఉప్పు, కొవ్వు వివరాలు స్పష్టంగా చూపించాలి
- ప్రజల ఆరోగ్యం కంటే కార్పొరేట్ ప్రయోజనాలా?
- రెండు వారాల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశం
- వినియోగదారులకు తెలుసుకునే హక్కు ఉందన్న ధర్మాసనం
- లేబుళ్ల అమలులో జాప్యంపై అసంతృప్తి
- 'మీరు చేయకపోతే మేమే చేస్తాం'
- పిల్లల ఆరోగ్య పరిరక్షణే ప్రధానమన్న కోర్టు
- ఎఫ్ఎస్ఎస్ఏఐ తీరుపై ప్రశ్నల వర్షం

02

### ఆహార ప్యాకెట్లపై హెచ్చరికలు తప్పనిసరి!

ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్స్ ద్వారా అందించే సమాచారం విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్యాకెట్లపై అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు వంటి అంశాలను స్పష్టంగా తెలియజేసే విధానాన్ని అమలు చేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. ఈ విషయంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన కోర్టు, వినియోగదారులకు ముఖ్యంగా పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహార ఎంపికలపై అవగాహన కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.



### రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం
# నడుస్తోంది

- అక్రమాలపై నిలదీస్తే కేసులతో జైళ్లకు పంపుతున్నారు
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టే ఇందుకు నిదర్శనం
- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం

**కర్నూలు, ఆగస్టు 13, (నేటి దర్శిని**

రాష్ట్రంలో అమలువుతున్న 'రెడ్ బుక్ రాజ్యాంగం'పై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్, జైలుకు పంపిన తీరు రాష్ట్రంలో బాధితులే నిందితులుగా మారుతున్న దారుణ పరిస్థితికి అద్దం పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తూ, చివరకు ఎమ్మెల్యేల ఇళ్లను కూడా ధ్వంసం చేసి అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఈ కుట్రల పాలన సాగుతోందని జగన్ విమర్శించారు. రాత్రి 2:45 గంటల సమయంలో వందల మంది పోలీసులు దొంగల్లా, బందిపోటు ముఠాలా వచ్చి ఎమ్మెల్యే విరూపాక్షి ఇంటి డోర్లు, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఆయనను అపహరించుకుపోయారని ఆరోపించారు. పగటిపూట నోటీసులు ఇస్తే రాని ఉగ్రవాదా ఆయన అని ప్రశ్నించారు.

-మిగతా 2 లో

# రాజధానికి రాజమార్గం

### అమరావతి నిర్మాణంలో మొదటి మెట్టు

- ఐదు కాన్సెప్టులతో దేశం మెచ్చిన రాజధానిగా అమరావతి
- స్టీల్ బ్రెడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాయపూడిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయం పరిశీలన

**అమరావతి ఆగస్టు 13, (నేటి దర్శిని**

సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభంతో రాజధాని అమరావతికి రాజమార్గం ఏర్పాటు అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రఅభివృద్ధిలో, అమరావతి నిర్మాణంలో ఇది మొదటి మెట్టు అని సీఎం స్పష్టం చేశారు. ఉండవల్లి వద్ద రాజధాని అమరావతిని విజయవాడ - మంగళగిరి - గుంటూరులతో కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ-3ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రహదారిని అనుసంధానించేలా బకింగ్ హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిని కూడా సీఎం ప్రారంభించారు. వీటి ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని

-మిగతా 2 లో








# నాపైనే కుల వివక్ష

- హల్ద్వానీ ఘటనతో అవమానానికి గురయ్యానన్న ఖర్గే
- ప్రసంగించిన ప్రదేశంలో శుద్ధీకరణపై తీవ్ర అభ్యంతరం
- 'ప్రజాస్వామ్యంలో ఇదేం పద్ధతి' అంటూ రాజ్యసభలో ఆవేదన
- అంటరానితనం చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్
- ఘటనపై విచారణ జరిపిస్తామని కేంద్రం హామీ

**న్యూఢిల్లీ ఆగస్టు 13, (నేటి దర్శిని**

బీజేపీ పాలనలో దళితులకు సరైన గౌరవం దక్కదని మరోసారి రుజువైంది. ఈ అనుభవం సాక్షాత్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఎదురైంది. రాజ్యసభ ప్రతిపక్ష నేత కూడా అయిన ఖర్గేకు ఉత్తరా ఖండ్‌లో తీవ్ర అవమానం జరిగింది. ఈనెల 8న ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ లో ఖర్గే ఒక బహిరంగసభలో ప్రసంగించిన

-మిగతా 2 లో



### 80వ స్వాతంత్ర్య వేడుకలు..
# ముస్తాబైన ఎర్రకోట

- 80వ స్వాతంత్ర్య వేడుకలకు సర్వాంగ సుందరంగా ఎర్రకోట
- ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్న ప్రధాని మోదీ
- 'వందేమాతరం-150', 'వికసిత్ భారత్@2047' ప్రధాన థీమ్‌లు
- వందేమాతరం ఆకృతిలో 2,500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, వాలంటీర్లు
- 5 వేల మంది ప్రత్యేక ఆహ్వానితులతో ఘనంగా వేడుకలు
- భద్రత, రవాణా, పారిశుద్ధ్య ఏర్పాట్లు పూర్తి

02

# భారత్‌ను కప్పేసిన నైరుతి మేఘాలు



- బలం పుంజుకున్న రుతుపవనాలు
- అల్పపీడన ప్రభావంతో చురుగ్గా మారిన రుతుపవనాలు
- దేశవ్యాప్తంగా విస్తరించిన దట్టమైన మేఘావరణం
- ఉపగ్రహ చిత్రాల్లో స్పష్టమైన వర్షపు మేఘాల కదలిక
- పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక
- ఒడిశా, పశ్చిమ బెంగాల్‌పై అల్పపీడన ప్రభావం

02

# పార్లమెంటులో 12 బిల్లులు ఆమోదం



- వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులకు పార్లమెంట్ ఆమోదం
- 11 బిల్లులు చర్చ లేకుండానే లోక్‌సభలో ఆమోదం
- నీట్ అవకతవకల బిల్లుపైనే ఉభయ సభల్లో విస్తృత చర్చ
- మోడీ, షా వైఖరితో స్తంభించిన సభలంటూ ప్రతిపక్షాల విమర్శ
- లోక్‌సభ ఉత్పాదకత 19%, రాజ్యసభ 39%గా నమోదు

02

### ఏపీలో మోగనున్న
# స్థానిక నగారా


### ఓటర్ల జాబితాల ప్రచురణకు ఆదేశాలు




- ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు తొలి అడుగు
- ఓటర్ల జాబితాల ప్రచురణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్
- సెప్టెంబర్ 3న పురపాలికల్లో, ఆగస్టు 17న కొన్ని పంచాయతీల్లో జాబితాల ప్రకటన
- ఆగస్టు 31లోగా గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ఖరారుకు ఆదేశాలు
- సెప్టెంబర్, అక్టోబర్లలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అంచనా

**అమరావతి ఆగస్టు 13, (నేటి దర్శిని**

: ఏపీ లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఓటర్ల జాబితాల ప్రచురణకు నోటిఫికేషన్ను జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైనట్లయింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్చంద్ర పునేఠా, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో సెప్టెంబర్ 3న ఫోటో ఎలక్టోరల్ రోల్స్ను ప్రచురించాలని ఆదేశాలు జారీ చేశారు. -మిగతా 2 లో



# చీకట్లో బంగ్లాదేశ్..

- తీవ్ర విద్యుత్ సంక్షోభంలో దేశం..
- రోజుకు 10 గంటల వరకు విద్యుత్ కోతలు
- చమురు కొరతతో తగ్గిన విద్యుత్ ఉత్పత్తి
- డీజిల్ సరఫరా కోసం భారత్‌కు ఢాకా విజ్ఞప్తి
- ప్రజల ఆగ్రహం.. పరిశ్రమలు, రైతులపై తీవ్ర ప్రభావం
- సాయం చేయాలంటూ ఇండియాకు వినతి

**న్యూఢిల్లీ ఆగస్టు 13, (నేటి దర్శిని**

కొద్ది రోజులుగా బంగ్లాదేశ్ చీకట్లో మగ్గుతోంది. దేశం ఎప్పుడూ లేని విధంగా, తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కుంటోంది. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఏకంగా 9-10 గంటల విద్యుత్ కోతలు నమోదవుతున్నాయి. తారిక్ రహమాన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఈ విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కోలేకపోతోంది. చివరకు భారత్ సాయం కావాలని కోరింది. గతంలో ఎప్పుడూ లేని విద్యుత్ సంక్షోభాన్ని ప్రస్తుతం బంగ్లాదేశ్ ఎదుర్కుంటోంది. తగినంత విద్యుత్ సరఫరా చేయలేకపోవడంతో దేశమంతా భారీ విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 10 గంటల వరకు కోతలు -మిగతా 2 లో




# అంబులెన్స్ ఆలస్యమైతే 10 వేల జరిమానా!

- హైవేల్లో 10 కి.మీ పరిధిలో 10 నిమిషాల్లో చేరుకోవాలి
- ప్రమాదాల్లో జాప్యం నివారణకు ఎన్‌హెచ్‌ఏఐ మార్గదర్శకాలు

**న్యూఢిలీ ఆగస్టు 13, (నేటి దర్శిని**

జాతీయ రహదారులపై ప్రమాదాల సమయంలో అత్యవసర స్పందనలో జరిగే ఆలస్యాన్ని నివారించేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) 10 నిమిషాల డెడ్‌లైన్‌ను తీసుకొచ్చింది. 10 కిలోమీటర్ల పరిధిలోని ప్రమాదస్థలికి 10 నిమిషాల్లోపు అంబులెన్స్ చేరుకోవాలని బుధవారం విడుదల చేసిన తన విధాన మార్గ దర్శకాల్లో పేర్కొంది. ఇలా చేరుకోని పక్షంలో ప్రతి ఘటనలో రూ.10 వేలు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపింది. ఈ ప్రమాదాల్లో సహాయ టికెట్ అభ్యర్థనను ఆమోదించినప్పటి నుంచి గంట లోపు

-మిగతా 2 లో

# పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

-ఆహార ప్యాకెట్లపై హెచ్చరికలు తప్పనిసరి!
-కేంద్రానికి సుప్రీంకోర్టు గట్టి హెచ్చరిక
-చక్కెర, ఉప్పు, కొవ్వు వివరాలు స్పష్టంగా చూపించాలి
-ప్రజల ఆరోగ్యం కంటే కార్పొరేట్ ప్రయోజనాలా?
-రెండు వారాల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశం
-వినియోగదారులకు తెలుసుకునే హక్కు ఉందన్న ధర్మాసనం
-లేబుళ్ల అమలులో జాప్యంపై అసంతృప్తి
-'మీరు చేయకపోతే మేమే చేస్తాం'
-పిల్లల ఆరోగ్య పరిరక్షణే ప్రధానమన్న కోర్టు
-ఎఫ్ఎస్ఎస్ఏఐ తీరుపై ప్రశ్నల వర్షం



న్యూఢిల్లీ
అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈ÷ూంఎ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది

## నాపైనే కుల వివక్ష

మొదటి తరువాయి

తర్వాత ఆ ప్రదేశం అపవిత్రమై పోయిందంటూ బీజేపీ అనుబంధ వర్గాలు శుద్ధి కార్యక్రమం నిర్వహించాయి. ఇది సోషల్ మీడియాతో పాటు ప్రధాన స్రవంతి మీడియాలోనూ వైరల్‌గా మారింది. దీంతో ఈ ఘటన తీవ్ర సంచలనాన్ని సృష్టించింది. కాంగ్రెస్, బీజేపీల పరస్పర విమర్శలకు దారితీసింది. ఖర్గే ప్రసంగించిన ప్రాంతంలో బీజేపీతో కలిసి శ్రీరామ్ సేన శుద్ధీకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ఘటనపై ఖర్గే గురువారం రాజ్యసభలో ఆవేదనతో ప్రసంగించారు. హల్ద్వానీలో ఒక బహిరంగ సభలో ప్రసంగించిన తర్వాత ఒక అంటరానితనం తాలుకు చేదు అనుభవాన్ని తాను చవిచూడాల్సి వచ్చిందని మల్లికార్జున ఖర్గే అన్నారు. "దీనిని రాజకీయం చేద్దామని ఎప్పుడూ అనుకోలేదు. చాలా ఏండ్లుగా నేను పార్లమెంట్లో ఉన్నాను. ప్రస్తుతం రాజ్యసభలో, గతంలో దిగువ సభలో సభ్యుడిగా ఉన్నాను. ఎప్పుడూ సానుభూతిని పొందడానికి ప్రయత్నించ లేదు. నాది షెడ్యూల్డ్ కులం, నేను దళితుడినని చెప్పి సహాయం, రక్షణ కల్పించా లని ఎన్నడూ అడుగ లేదు" అని ఆయన రాజ్యసభలో తెలిపారు. "హల్ద్వానీలో నేను ప్రసంగించినప్పుడు లక్షలాది మంది ప్రజలు ఉన్నారు. నేను ఏ కులం, మతం పేరునూ ప్రస్తావించ లేదు. ప్రజల సమస్యలకు సంబంధించిన అంశా లను మాత్రమే ప్రస్తావించా. కానీ నా ప్రసంగం పూర్తయిన తర్వాత మీరు (బీజేపీ అనుబంధ సభ్యులు) శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించి నన్ను అవమానించడానికి ప్రయత్నించారు. అస్పృశ్యత తాలుకు బాధను మీరు అనుభవం లోకి తెచ్చారు. ప్రజాస్వామ్యంలో ఇదేం పద్ధతి? రాజ్యాంగాన్ని ఎలా పరిరక్షిస్తారు? నేను ప్రతిపక్ష నాయకుడిని. పోరాటం చేసే శక్తి ఉంది. పోరాడుతాను" అని వివరించారు. వేదికను శుద్ధి చేసిన వారిపై అంటరానితనం చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కాగా, అలాంటి చర్యలను బీజేపీ ఎంతమాత్రమూ ప్రోత్సహించదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు. దీనిపై దర్యాప్తు చేయిస్తామని ఆయన హామీనిచ్చారు.

## అంబులెన్స్ ఆలస్యమైతే 10 వేల జరిమానా!

మొదటి తరువాయి

దగ్గరలోని దవాఖానకు బాధితులను చేర్చాలని సూచించింది. దీన్ని ఉల్లంఘించిన వారికి రూ.10 వేల వరకు జరిమానా విధించే అవకాశముందని చెప్పింది.10 కిలోమీటర్ల పరిధి దాటిన ప్రమాదాల్లో అంబులెన్స్ చేరుకోవాల్సిన సమయం దామషా ప్రకారం పెరుగుతుందని.. ఇది జీపీఎస్ డేటా/ఐఎమ్ఎస్ కేర్ డ్యాష్ బోర్డ్ ద్వారా ధ్రువీకరణ అవుతుందని స్పష్టం చేసింది. ఎమర్జెన్సీ టికెట్‌ను తిరస్కరిస్తే రూ.10 వేలు జరిమానా విధిస్తామని వెల్లడించింది. ఒప్పందాల్లో భాగంగా పరికరాలు, మందులు, సిబ్బందిని సమకూర్చని సంస్థలకు రూ.10 వేల జరిమానా వేస్తామని తెలియజేసింది. తాజా మార్గదర్శకాలను ప్రాజెక్ట్ డైరెక్టర్లు, ప్రాంతీయ అధికారులు కట్టదిట్టంగా అమలు చేయాలని ఆదేశించింది. ఇప్పటికే జాతీయ రహదారులపై వివిధ సేవల కోసం 1033 హెల్ప్‌లైన్ నెంబర్‌ను ఎన్‌హెచ్ఏఐ నిర్వహిస్తున్నది.

## రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

# నడుస్తోంది

మొదటి తరువాయి

గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై మూడు అక్రమ కేసులు పెట్టడమే కాకుండా ఆయన కుమారుడు, తమ్ముడు, తమ్ముడి కుమారుడిని కూడా ఈ కేసుల్లో ఇరికించారని మండిపడ్డారు. ఆగష్టు 1న సంగాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గిరిపై దాడి జరుగు తుంటే, ఆయన రక్షణ కోసం ఎమ్మెల్యే విరూపాక్షి మానవత్వంతో అక్కడికి వెళ్లడమే నేరమన్నట్లు



పోలీసులు వ్యవహరించారని జగన్ తెలిపారు. స్థానిక ఎస్సై, సీఐలకు ఫోన్ చేసినా పోలీసులు కాపాడక పోవడంతోనే ఎమ్మెల్యే స్వయంగా వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాత నెమకల్లు వద్ద ఎమ్మెల్యేపై దాడి చేసి, ఆయన తమ్ముడి చెయ్యి విరగ్గొట్టారని వెల్లడించారు. ఈ నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒక టీడీపీ కార్యకర్త తన భార్య బట్టలు తానే చించి, ఆ నెపం ఎమ్మెల్యేపై నెట్టి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయని, సదరు మహిళతో తప్పుడు మాటలు చెప్పిస్తూ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని, ఈ అక్రమాలపై ప్రజాస్వామ్యవాదులంతా ఆలోచించాలని జగన్ పిలుపునిచ్చారు.

# రాజధానికి రాజమార్గం

మొదటి తరువాయి

మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్‌లతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాయపూడి నుంచి వెంకటపాలెం- పెనుమాక మీదుగా ఉండవల్లి వరకు సీడ్ యాక్సెస్ రహదారిని సిఆర్‌డిఎ నిర్మించింది. స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించడంతో రాజధాని నగరానికి మెరుగైన కనెక్టివిటీ వచ్చినట్లైంది. మూడో దశలో మణిపాల్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి 16కు అనుసంధానించేలా ప్రణాళిక చేశారు. దీనికి రూ.1,519 కోట్ల వ్యయం కానుంది. స్టీల్ బ్రిడ్జిలతో పాటు సీడ్ యాక్సెస్ రహదారిని సీఎం కాలినడకన తిరిగి ఆద్యంతం పరిశీలించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ... "రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి మెట్టు. తెలుగు జాతి గర్వపడేలా ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ నిర్మాణం జరిగింది. విభజన తర్వాత రాష్ట్రం నష్ట పోయింది. రాజధాని కూడా లేకుండా పోయింది. 25 పార్లమెంటు స్థానాల్లో మధ్యలో ఉన్న గుంటూరు




జిల్లాలో రాజధాని పెట్టాలని ఆనాడు సంకల్పించాం. విస్తృత చర్చల తర్వాత మాపై విశ్వాసంతో రైతులు రాజధాని నిర్మాణం కోసం ముందుకు వచ్చి భూములు ఇచ్చారు. రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులందరికీ పాదాభివందనం చేస్తున్నాను. రైతులది త్యాగం కాదు సృష్టి. సింగపూర్ అమరావతి బృహత్ ప్రణాళికను ఉచితంగా ఇచ్చి సహకరించింది. గత పాలకులు ప్రజలతో పాటు సింగపూర్ ప్రతినిధులను కూడా వేధింపులకు గురిచేశారు. ప్రభుత్వ కాంప్లెక్సు భవనాలు ప్రత్యేకంగా ఉండాలని ప్రముఖ ఆర్కిటెక్టులతో డిజైన్లు చేయించాం. కొందరు గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజం అవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తలలు దించుకోవాలి. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశాం. అసెంబ్లీలో రాజధాని 40 వేల ఎకరాలు కావాలన్నదే నా మూడు రాజధానులని మాట తప్పేవాడు. 2019-24 మధ్య రైతుల ఉద్యమాన్ని చరిత్ర మర్చిపోదు. అమరావతితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. అమరావతిని అహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# 80వ స్వాతంత్ర్య వేడుకలు.. ముస్తాబైన ఎర్రకోట

**న్యూఢిల్లీ**

దేశ రాజధాని ఢిల్లీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎర్రకోట సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆగస్టు 15న ఎర్రకోటపై ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలను 'వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు', 'వికసిత్ భారత్ఏ2047 కోసం యువశక్తి' అనే ప్రధాన థీమ్‌లతో నిర్వహించనున్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం గీతం ప్రాధాన్యాన్ని గుర్తుచేయడంతో పాటు, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణంలో యువత పాత్రను చాటిచెప్పేలా కార్యక్రమాలను రూపొందించారు. జ్ఞానపథ్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాలు ఈసారి వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సుమారు 2,500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, 'మై భారత్' వాలంటీర్లు వందేమాతరం ఆకృతిలో కూర్చోనున్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. వివిధ రంగాలకు చెందిన సుమారు 5 వేల మంది ప్రత్యేక ఆహ్వానితులు ఎర్రకోటలో జరిగే వేడుకలను ప్రత్యక్షంగా



వీక్షించనున్నారు. సమాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా వీరిని ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు. వేడుకలకు వచ్చే ఆహ్వానితులు, సందర్శకుల సౌకర్యార్థం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉచిత మెట్రో ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. సంప్రదాయ ఆహ్వాన పత్రికలకు బదులుగా క్యూఆర్ కోడ్ ఆధారిత ఈ-ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. దీంతో కార్యక్రమానికి హాజరయ్యే వారికి ప్రవేశ ప్రక్రియ సులభతరం కానుంది. మరోవైపు ఎర్రకోట పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, అతిథుల రాకపోకలు, పార్కింగ్ తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. భారీ సంఖ్యలో ప్రజలు, ఆహ్వానితులు హాజరుకానున్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వేడుకలు ముగిసిన వెంటనే ఎర్రకోట పరిసరాల్లో 'స్వచ్ఛత ప్రచారం' చేపట్టనున్నారు. చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. మొత్తంగా జాతీయ స్ఫూర్తి, వందేమాతరం వారసత్వం, యువశక్తి, అభివృద్ధి లక్ష్యాలను ప్రతిబింబించేలా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

## పార్లమెంటులో 12 బిల్లులు ఆమోదం

**-వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులకు పార్లమెంట్ ఆమోదం**
**-11 బిల్లులు చర్చ లేకుండానే లోక్‌సభలో ఆమోదం**
**-నీట్ అవకతవకల బిల్లుపైనే ఉభయ సభల్లో విస్తృత చర్చ**
**-మోడీ, షా వైఖరితో స్తంభించిన సభలంటూ ప్రతిపక్షాల విమర్శ**
**-లోక్‌సభ ఉత్పాదకత 19%, రాజ్యసభ 39%గా నమోదు**



న్యూఢిల్లీ బ్యూరో
జులై 20న ప్రారంభమైన వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్ 12 బిల్లులను ఆమోదించింది. వీటిలో ఒక బిల్లుపై మాత్రమే ఉభయ సభలలో కూలంకషంగా చర్చ జరిగింది. నీట్ లీక్ తరువాత విద్యార్థుల నిరసనలను అణచివేసేందుకు ప్రవేశపెట్టిన 'పబ్లిక్ పరీక్షల అవకతవకల నివారణ (సవరణ) బిల్లు'పై లోక్‌సభలో 10 గంటల 54 నిమిషాలు, రాజ్యసభలో 6 గంటల 39 నిమిషాలు చర్చ జరిగింది. లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ చర్చకు వచ్చిన ఏకైక బిల్లు ఇదే. ఈ బిల్లు మినహా, మరే ఇతర బిల్లుపైనా ఏ సభలోనూ కూలంకషంగా చర్చ జరగలేదు. లోక్‌సభ 11 బిల్లులను చర్చ లేకుండానే ఆమోదించింది. ఈ బిల్లులలో తొమ్మిదింటిపై సంబంధిత మంత్రులు మాత్రమే మాట్లాడారు. ?కీలకమైన అంశాలపై వివరణలు ఇవ్వని కేంద్ర ప్రభుత్వ దుస్సాహసానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఉభయ సభలలో తీవ్రంగా నిరసన తెలుపుతుండగా... కేంద్ర ప్రభుత్వం మాత్రం చర్చ లేకుండానే ముఖ్యమైన బిల్లులను ఆమోదించడంలో నిమగ్నమైంది. 'మ్యాగీ నూడుల్స్ తయారు చేసినంత సులభంగా' కేంద్ర ప్రభుత్వం బిల్లులను ఆమోదిస్తుందన్న తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరిక్ ఓ'బ్రియన్ విమర్శను వర్షాకాల సమావేశాల గణాంకాలు కూడా ధృవీకరిస్తున్నాయి. 1969 జనన, మరణాల నమోదు చట్టాన్ని సవరించడానికి ఉద్దేశించిన ముఖ్యమైన బిల్లుపై లోక్‌సభలో ఎలాంటి చర్చా జరగలేదు. మరోవైపు, రాజ్యసభలో కేవలం 50 నిమిషాలు మాత్రమే చర్చ జరిగింది. ప్రతి ఎంపీకి కేటాయించిన సగటు సమయం మూడు నిమిషాలు మాత్రమే. విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు (ఎఫ్‌సీఆర్ఏ)ను అధ్యయనం, నివేదిక కోసం సంయుక్త సభా సంఘాని (జేపీసీ)కి నివేదించారు. వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ సామర్థ్యం 19 శాతంగా, రాజ్యసభ సామర్థ్యం 39 శాతంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అనవసరమైన ప్రతిపక్ష నిరసనలు ఉభయ సభల సామర్థ్యాన్ని దెబ్బతీశాయని కూడా మంత్రి ఆరోపించారు. అయితే, కీలకమైన అంశాలపై వివరణ ఇవ్వడానికి, చర్చలు జరపడానికి సిద్ధంగా లేని కేంద్ర ప్రభుత్వం, వర్షాకాల సమావేశాలను నిరసనల సముద్రంలో ముంచివేసిందని ప్రతిపక్షాలు ఎత్తి చూపాయి. ?ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత, 2016లో పెద్ద నోట్ల రద్దు అనంతరం జరిగిన నిరసనల కారణంగా వర్షాకాల సమావేశాలు పూర్తిగా రద్దయ్యాయి. లోక్‌సభ తనకు కేటాయించిన సమయంలో కేవలం 15 శాతం, రాజ్యసభ 18 శాతం మాత్రమే పనిచేశాయి. 2018 బడ్జెట్ సమావేశం, 2021 వర్షాకాల సమావేశం, 2023 బడ్జెట్ సమావేశాలు కూడా భారీ నిరసనలతో దెబ్బతిన్నాయి.

## చీకట్లో బంగ్లాదేశ్..

మొదటి తరువాయి

అమలవుతున్నాయి.దేశంలో 18,000 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా, ఉత్పత్తి మాత్రం 13,000 వాట్లకు తక్కువగానే ఉంది. అసలే, అక్కడి ప్రజలు ప్రస్తుతం తీవ్రమైన ఎండ, ఉక్కపోతలతో అల్లాడుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. ఈ క్రమంలో స్థానిక విద్యుత్ పంపిణీ కేంద్రాలైన పవర్ స్టేషన్లపై, అధికారులపై ప్రజలు దాడులు చేస్తున్నారు. దీంతో పవర్ స్టేషన్ల వద్ద రక్షణ కల్పించాల్సిందిగా పోలీసుల్ని ప్రభుత్వం ఆదేశించింది. విద్యుత్ కోతను ఎదుర్కొనేందుకు పరిశ్రమలకు విద్యుత్ సరఫరా తగ్గించివేసింది. అలాగే, రాజధాని ఢాకాతోపాటు అనేక నగరాల్లో షాపులు, ఇతర వాణిజ్య, వ్యాపార సంస్థలు, షాపింగ్ మాల్స్ అన్నీ రాత్రి 8.00 గంటలకే మూసేయాలని ఆదేశించింది. రైతులు కూడా తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా రైతులు, వ్యాపార సంస్థల యజమానులు, పరిశ్రమలు విద్యుత్ కొరత ప్రభావానికి గురవుతున్నాయి. ఈ విద్యుత్ సంక్షోభానికి కారణం చమురు కొరత. తగినంత చమురు లేకపోవడం వల్ల విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోతోంది. బంగ్లాదేశ్ 90 శాతం చమురును, 30 శాతం గ్యాస్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. అయితే, విదేశాల నుంచి తగినంత చమురు లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో సాయం చేయాల్సిందిగా ఇండియాను బంగ్లాదేశ్ కోరింది.

## భారత్‌ను కప్పేసిన నైరుతి మేఘాలు



న్యూఢిల్లీ:
భారతదేశం మీద దట్టమైన నైరుతి వర్షపు మేఘాలు కమ్ముకున్నట్లు ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి. రుతుపవనాలు మళ్లీ బలం పుంజుకుంటున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన కొత్త అల్పపీడన వ్యవస్థ తూర్పు, మధ్య భారత ప్రాంతాల వాతావరణాన్ని ప్రభావితం చేస్తోంది. దీని వల్ల దేశంలోని విస్తార ప్రాంతాలు మందపాటి మేఘాల కింద ఉన్నాయని ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ఆగస్టు 13న యూమెట్ శాట్, ఇస్రో ఇన్శాట్ ఉపగ్రహాలు తీసిన చిత్రాల్లో అరేబియా సముద్రం నుంచి మధ్య భారతదేశం, గంగా మైదానాలు, ఈశాన్య ప్రాంతాల వరకు విస్తరించిన విస్తృత మేఘావరణం కనిపిస్తోంది. ఉత్తర బంగాళాఖాతం, తూర్పు భారతదేశం, బంగ్లాదేశ్ పరిసర ప్రాంతాల్లో అత్యంత తీవ్రమైన మేఘ సమూహాలు కేంద్రీకృతమై ఉన్నాయి. ఇక్కడ కొత్తగా ఏర్పడిన అల్పపీడన ప్రాంతం తేమను లోతట్టు ప్రాంతాల్లోకి లాగుతోంది. భారత వాతావరణ శాఖ ప్రకారం పశ్చిమ బెంగాల్ - బంగ్లాదేశ్ తీరం వద్ద ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడింది. ఈ వ్యవస్థ లోతట్టు ప్రాంతాల్లోకి కదులుతూ ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, పరిసర రాష్ట్రాల్లో విస్తృత వర్షపాతం కొనసాగే అవకాశం ఉంది. ఉపగ్రహ చిత్రాల్లో తూర్పు భారతదేశంపై లోతైన సంవాహన మేఘాలు, చల్లని మేఘ శిఖరాలు కనిపిస్తున్నాయి. ఇవి తీవ్రమైన ఉరుములు, భారీ వర్షాలకు సంకేతాలు. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ ఈశాన్య ప్రాంతాల్లో కూడా పెద్ద మేఘ రాశులు కనిపిస్తున్నాయి. దీని వల్ల రుతుపవనాలు దేశవ్యాప్తంగా చురుకుగా ఉందని స్పష్టమవుతోంది. వాతావరణ అధికారులు అనేక రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఒడిశా ప్రత్యేక దృష్టిలో ఉంది.

## ఏపీలో మోగనున్న స్థానిక నగారా

మొదటి తరువాయి

అలాగే, గతంలో జాబితాలు ప్రచురించని 20 గ్రామ పంచాయతీల్లో ఆగస్టు 17న ఓటర్ల జాబితాలను ప్రకటించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు యంత్రాంగాన్ని సిద్ధం చేసే పనులను ఎస్ఈసీ వేగవంతం చేసింది. ఇటీవల మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల కార్యదర్శులతో కమిషనర్ పునేతా సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఎన్నికల నిర్వహణలో మొదటి దశ అయిన ఓటర్ల జాబితాల ప్రకటనతో ఈ కసరత్తు మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోని 4,033 డివిజన్లు, వార్డులకు ఓటర్ల జాబితాలను ప్రచురించనున్నారు. వీటిలో 17 కార్పొరేషన్లు, 88 మున్సిపాలిటీలు, 18 నగర పంచాయతీలు ఉన్నాయి. 2021లో కొన్ని చోట్ల న్యాయస్థానాల్లో కేసుల కారణంగా ఎన్నికలు నిలిచిపోగా, ఈసారి అన్నిచోట్లా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు, గ్రామ పంచాయతీల్లో కూడా ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. ఈ నెల 21 నుంచి 31వ తేదీలోగా రాష్ట్రంలోని 13 వేలకు పైగా గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల జాబితాలను ప్రచురించాలని, వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ఖరారు చేయాలని ఆదేశించారు. 2026 జనవరి 1వ తేదీని అర్హతగా తీసుకుని తుది ఓటర్ల జాబితాలను సిద్ధం చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో మేయర్లు, ఛైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ పరిణామాలతో అంతా ప్రణాళిక ప్రకారం జరిగితే సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలల్లో స్థానిక ఎన్నికలు జరగవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# రైతు బోయ ఆంజనేయులు కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం అందించి తీరాల్సిందే..!

- ఆంజనేయుల కుటుంబాన్ని పరామర్శించిన ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి



**గుంతకల్లు, ఆగస్టు 13, (నేటి దర్శిని**

విద్యుత్ తీగలు తెగిపడిన ప్రమాదంలో మృతి చెందిన రైతు గుంతకల్లు మండలం కసాపురం బోయ ఆంజనేయులు కుటుంబానికి ప్రభుత్వం రూ 50 లక్షలు పరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వ్యవసాయ పొలం పనుల్లో ఉండగా విద్యుత్తు తీగలు తెగిపడి గుంతకల్లు మండలం కసాపురం గ్రామానికి చెందిన రైతు బోయ ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందారు. కాలం తీరిన విద్యుత్ తీగలకు మరమ్మత్తులు చేయని విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని, దీనికి పూర్తి బాధ్యత విద్యుత్ శాఖ అధికారులు తీసుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏ ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కుటుంబ పెద్దగా ఉన్న బోయ ఆంజనేయులు మృతి చెందాడని, ఆంజనేయులు కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిది, విద్యుత్ శాఖదే అని అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన ఆంజనేయులు కుటుంబ సభ్యులను గురువారం రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజారాం రెడ్డి, సిపిఎం జిల్లా నాయకులు శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, పార్టీ పట్టణ నాయకులు కసాపురం రమేష్, నాగరాజు, జగ్గిల రమేష్, సురేంద్ర, రాము నాయక్ రామయ్య తదితరులతో కలిసి ఆంజనేయులు కుటుంబాన్ని పరామర్శించారు. ఆంజనేయులు మృతితో ఆ కుటుంబం ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిందని.. ఆంజనేయులు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఆంజనేయులు కుటుంబానికి రూ. 50 లక్షలు ఆర్థిక సహాయం పరిహారంగా అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# నందికొట్కూరు హైవేపై ఉద్రిక్తత

-వైసీపీ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు

-బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కాన్వాయ్ రాకతో పెరిగిన ఉత్కంఠ.. భారీ బందోబస్తు



**నందికొట్కూరు, ఆగస్టు 13, (నేటి దర్శిని**

:మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో నందికొట్కూరు హైవేపై బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జగన్ పర్యటనకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకోవడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచే జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జెండాలు, జగన్ ఫొటోలతో హైవే వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. అనుమతి లేకుండా ర్యాలీగా వెళ్లేందుకు వీలులేదని పోలీసులు వారిని నిలిపివేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ ఆధ్వర్యంలో సీఐలు సుబ్రహ్మణ్యం, అశోక్‌కుమార్, ఎస్సై చంద్రశేఖర్ భారీ పోలీసు బలగాలను మోహరించారు. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు హైవేపై బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను పర్యవేక్షించారు. ఇదే మార్గంలో రాష్ట్ర వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కాన్వాయ్ రావడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. కాన్వాయ్‌ను పోలీసులు అడ్డుకోవడంతో బైరెడ్డి వర్గీయులకు, పోలీసులకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గుమికూడడంతో చివరకు పోలీసులు వాహనాలను అనుమతించారు.

# విరూపాక్షి బెయిల్‌పై వాయిదా

-ఈనెల18కు విచారణ వాయిదా..

-ఆదోని కోర్టులో వాదనలు



**కర్నూలు రూరల్ బ్యూరో, ఆగస్టు 13, (నేటి దర్శిని**


అట్రాసిటీ కేసులో అరెస్టయి కర్నూలు జిల్లా జైలులో ఉన్న ఆలూరు ఎమ్మెల్యే బి. విరూపాక్షి బెయిల్ పిటిషన్‌పై గురువారం ఆదోని సెకండ్ క్లాస్ కోర్టులో వాదనలు జరిగాయి. ఎమ్మెల్యే విరూపాక్షితో పాటు మరో 20 మందికి బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. బెయిల్ పిటిషన్లపై ఉదయం కోర్టు వాదనలు విన్నది. తొలుత విచారణను సాయంత్రం 5 గంటలకు వాయిదా వేసింది. అనంతరం పిటిషన్లపై తదుపరి విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేశారు. ఎమ్మెల్యేతో పాటు మరో 20 మంది బెయిల్ పిటిషన్లపై తదుపరి విచారణలో వాదనలు కొనసాగనున్నాయి. దీంతో 18న కోర్టు నిర్ణయం ఎలా ఉండబోతుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# అమరావతి ఛాంపియన్‌షిప్‌కు పటిష్ట ఏర్పాట్లు






- 14,700 మంది క్రీడాకారులు, వెయ్యి మంది కోచ్‌లు,
- అధికారులకు సకల సదుపాయాలు
- వసతి, భోజనం, రవాణా, వైద్యం, పారిశుధ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి
- ఆగస్టు 24న తారకరామ స్టేడియంలో ప్రారంభోత్సవం
- శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్
- క్రీడా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలి: శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు





స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా త్రివర్ణ విద్యుత్ కాంతులతో తిరుపతి కలెక్టరేట్ కార్యాలయం.

**తిరుపతి ప్రతినిధి ఆగస్టు 13, (నేటి దర్శిని**

అమరావతి ఛాంపియన్‌షిప్--2026 రాష్ట్రస్థాయి క్రీడా మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఆగస్టు 24 నుంచి 27 వరకు తిరుపతిలో నిర్వహించనున్న ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన సుమారు 14,716 మంది క్రీడాకారులు, వెయ్యి మంది కోచ్‌లు, అధికారులు హాజరుకానున్న నేపథ్యంలో ఎక్కడా అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ మినీ వీసీ హాల్‌లో జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, క్రీడాకారిణి రజినితో కలిసి కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చెస్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, యోగా తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 23వ తేదీ రాత్రికే క్రీడాకారులు తిరుపతికి చేరుకునేలా రవాణా, వసతి ఏర్పాట్లు చేయాలని, 24వ తేదీ ఉదయం 8 గంటలకే తారకరామ స్టేడియానికి చేరుకునేలా ప్రత్యేక రవాణా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

సుమారు 16 వేల మందికి వసతి అవసరం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ వసతి వనరులను సమగ్రంగా వినియోగించుకోవాలని సూచించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో సుమారు 2 వేల మందికి, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో మహిళా క్రీడాకారులకు అవసరమైన వసతి కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. టీటీడీ విద్యాసంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయం, కళాశాలలు, డార్మిటరీలు, గెస్ట్‌హౌస్‌లతో పాటు అవసరమైతే ప్రైవేట్ విద్యాసంస్థల సహకారం తీసుకోవాలని తెలిపారు.

క్రీడాకారులు బస చేసే ప్రాంతాల్లోనే భోజన ఏర్పాట్లు చేయాలని, వేలాది మంది ఒకే ప్రాంతంలో గుమిగూడకుండా క్లస్టర్ విధానంలో డైనింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భోజన నాణ్యత, పరిశుభ్రత, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అన్ని వసతి కేంద్రాల నుంచి క్రీడా వేదికలకు క్రీడాకారులను సకాలంలో తరలించేందుకు సమగ్ర రవాణా ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి కేంద్రం నుంచి ఏ వేదికకు ఎంతమంది వెళ్తారో ముందుగానే గుర్తించి బస్సులను కేటాయించడంతో పాటు అవసరమైన చోట అదనపు బస్సులను సిద్ధంగా ఉంచాలన్నారు.

ఆగస్టు 24న తారకరామ స్టేడియంలో నిర్వహించే ప్రారంభోత్సవానికి భారీ సంఖ్యలో క్రీడాకారులు హాజరుకానున్నందున పారిశుధ్యం, తాగునీరు, వైద్యం, విద్యుత్, పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. జిల్లాల వారీగా క్రీడాకారులు తమ జెండాలతో మార్చ్‌పాస్ట్‌లో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని, ముందస్తుగా మాక్‌డ్రిల్ నిర్వహించి లోటుపాట్లను సరిదిద్దాలని సూచించారు. స్టేడియం పరిసరాల్లోని పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ప్రతి క్రీడా వేదిక వద్ద వైద్య సిబ్బంది, ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్సులు, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య సిబ్బందిని తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. ముఖ్యంగా మహిళా క్రీడాకారులు పాల్గొనే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వేదికల వద్ద ప్రత్యేక భద్రతా, వైద్య ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రస్థాయి క్రీడా మహోత్సవం తిరుపతి జిల్లాకు ప్రతిష్టాత్మక కార్యక్రమమని, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులకు జిల్లా ఆతిథ్యం చాటేలా ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. క్రీడలు, విద్య, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, రవాణా, వైద్య ఆరోగ్యం, ఆర్‌డబ్ల్యూఎస్, పౌరసరఫరాలు, టీటీడీ, విశ్వవిద్యాలయాలు తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రతిరోజూ ఏర్పాట్లను సమీక్షించాలని ఆదేశించారు.

**అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలి**

శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో అమరావతి ఛాంపియన్‌షిప్--2026ను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రాష్ట్రస్థాయి పోటీలకు వచ్చే క్రీడాకారులకు మెరుగైన వసతి, భోజనం, రవాణా తదితర సదుపాయాలు కల్పించి క్రీడా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

సమీక్షలో తిరుపతి నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ శారదాదేవి, డీఎస్‌డీఓ శశిధర్, డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్, ఆర్‌ఐఓ గోపాలరెడ్డి, సెట్విన్ అధికారి యశ్వంత్, డీఈఓ కుమార్, ఎస్వీ, వెటర్నరీ విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్లు, క్రీడాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా.. సవరణకు పకడ్బందీ చర్యలు

- నోటీసుల జారీ, పంపిణీ, విచారణలు
- పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి
- అర్హత కలిగిన ప్రతి ఓటరుకు అవకాశం కల్పించాలి
- ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేయాలి







**తిరుపతి ప్రతినిధి ఆగస్టు 13, (నేటి దర్శిని**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి సంతోష్‌కుమార్ దుబే అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణలో అర్హత కలిగిన ప్రతి ఓటరుకు అవకాశం కల్పిస్తూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దశను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌తో పాటు ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఇప్పటివరకు జరిగిన పురోగతిని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం కార్యదర్శి మాట్లాడుతూ నోటీసుల జారీ, వాటి పంపిణీ, ఓటర్ల నుంచి స్వీకరించే అభ్యంతరాలు, దరఖాస్తులు, విచారణలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వారీగా పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఓటర్లకు అవసరమైన సమాచారం అందించడంలో బూత్ స్థాయి అధికారులు కీలకపాత్ర పోషించాలని తెలిపారు. ఓటర్ల నుంచి అందే దరఖాస్తులు, పత్రాలు, అభ్యంతరాలను సక్రమంగా స్వీకరించి, సంబంధిత వ్యవస్థలో నమోదు చేసేలా పర్యవేక్షించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారుల పనితీరును పర్యవేక్షకులు, ఎన్నికల నమోదు అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. సవరణ ప్రక్రియలో భాగంగా నిర్వహించే విచారణలను కూడా సకాలంలో పూర్తి చేయాలని, ఒకే ప్రాంతంలో అధిక సంఖ్యలో విచారణలు పెండింగ్‌లో ఉండకుండా ముందస్తు ప్రణాళికతో షెడ్యూల్ రూపొందించుకోవాలని సూచించారు. విచారణలకు హాజరయ్యే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన కనీస వసతులు కల్పించడంతో పాటు సమాచార ప్రదర్శన, సంబంధిత జాబితాల ప్రచురణ తదితర అంశాలను అధికారులు పరిశీలించాలని ఎన్నికల సంఘం కార్యదర్శి సూచించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు నిబంధనల మేరకు అవసరమైన జాబితాలు, సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు.

**పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి**

జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఇప్పటివరకు సాధించిన పురోగతిని ఎన్నికల సంఘం కార్యదర్శికి వివరించారు. నోటీసుల జారీ, పంపిణీ, విచారణలు, కొత్త ఓటరు నమోదుకు సంబంధించిన దరఖాస్తులు, తొలగింపులు, మార్పులు, సవరణలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారం, బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాల వివరాల నమోదు తదితర అంశాలపై చేపడుతున్న చర్యలను వివరించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అంశాలను గుర్తించి వేగంగా పరిష్కరించేందుకు సంబంధిత ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, ఎన్నికల సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా, అనర్హులైన లేదా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నమోదులను నిబంధనల ప్రకారం పరిశీలించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి, ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రతి దశను పూర్తి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, తిరుపతి నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ శారదాదేవి, ఆర్డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, ఉప ప్రత్యేక కలెక్టర్లు భరత్‌నాయక్, నాగార్జున, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్‌బాబు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాకాలో మరో ముగ్గురు ముద్దుగుమ్మలు


## జాన్వీ, రష్మిక, మృణాల్ ఉన్నట్లుగా ప్రచారం




అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలకపాత్రని పోషిస్తున్నట్టు సమాచారం. 'రాకా' ప్రపంచంపైనా, ఇందులోని పాత్రలపైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.

# మహాదేవిగా కామాక్షి భాస్కర్ల సరికొత్త సాహసం..


## ఎం.ఎస్. రాజు 'అగధ'పై భారీ అంచనాలు!




టాలీవుడ్ తెరపై ఇప్పుడు లేడీ ఓరియెంటెడ్ సినిమాల హవా జోరుగా సాగుతోంది. ఒకప్పుడు గ్లామర్ పాత్రలకే పరిమితమైన కథానాయికలు, ఇప్పుడు బలమైన కథలను తమ భుజాలపై మోస్తూ బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టిస్తున్నారు. అరుంధతి చిత్రంతో అనుష్క శెట్టి వేసిన బలమైన ముద్ర నుంచి, ఇటీవలి కాలంలో సమంత 'మా ఇంటి బంగారం', రష్మిక మందన్న 'ది గర్ల్‌ఫ్రెండ్', నివేదా థామస్ '35' వంటి వైవిధ్యమైన చిత్రాల వరకు మహిళా ప్రధాన కథలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. అయితే ఈ ట్రెండ్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ఇప్పుడు మరో ప్రతిభావంతురాలైన నటి సిద్ధమయ్యారు. 'పొలిమేర' చిత్రాలతో నటిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న టెర్రిఫిక్ ఆర్టిస్ట్ కామాక్షి భాస్కర్ల , ప్రముఖ దర్శకుడు ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో తెరకెక్కిన తాజా సంచలన చిత్రం 'అగధ' తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆగస్టు 14న ఈ సినిమా అత్యంత గ్రాండ్‌గా విడుదల కాబోతోంది.ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల 'మహాదేవి' అనే అత్యంత శక్తివంతమైన, విభిన్నమైన ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన 'అగధ' టీజర్, ట్రైలర్‌లు సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. ఇప్పటివరకు కామాక్షి చేసిన సినిమాలకు, పాత్రలకు పూర్తి భిన్నంగా ఈ చిత్రం ఉండబోతున్నట్లు స్పష్టమవుతోంది. కేవలం నటనకు మాత్రమే కాకుండా, కథలో ప్రాధాన్యమున్న యాక్షన్ సన్నివేశాల్లోనూ ఆమె స్వయంగా నటించడం ఈ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేసింది. ఒక మహిళా ప్రధాన కథాంశంతో వస్తున్న ఈ సినిమా కామాక్షి కెరీర్‌లో మైలురాయిగా నిలవడమే కాకుండా, టాలీవుడ్‌లో ఉమెన్ సెంట్రిక్ సినిమాల విజయ పరంపరను మరింత ముందుకు తీసుకువెళ్లే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. విభిన్నమైన భావోద్వేగాలను పండిస్తూ, ఒక కొత్త సినిమాటిక్ అనుభూతిని పంచడానికి సిద్ధమైన 'అగధ' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మహాదేవిగా కామాక్షి భాస్కర్ల అద్భుత నటనను చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# తారక్ లేకున్నా ఆగని డ్రాగన్' షూటింగ్..

## -వచ్చే నెల నుంచి నయా షెడ్యూల్ షురూ!



టాలీవుడ్ అగ్ర కథనాయకుడు యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'డ్రాగన్' షూటింగ్‌కు సంబంధించి ఒక లేటెస్ట్ అప్‌డేట్ వచ్చేసింది. ఇటీవలే ఎన్టీఆర్ సర్జరీ విజయవంతంగా పూర్తి కావడంతో, ఈ సినిమా షూటింగ్ సెప్టెంబర్ 3 నుంచి తిరిగి ప్రారంభం కానున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై చిత్రయూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.భూజానికి జరిగిన సర్జరీ అనంతరం ఎన్టీఆర్ ప్రస్తుతం రెస్ట్ తీసుకుంటున్నప్పటికీ, సినిమా షూటింగ్‌లో ఎలాంటి బ్రేక్ ఉండకూడదని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 3 నుంచి మొదలయ్యే షెడ్యూల్‌లో టాకీ పార్ట్ తో పాటు చిన్ననాటి సన్నివేశాలను డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కించబోతున్నారు. తారక్‌కు సంబంధం లేని ఈ బ్యాలెన్స్ పోర్షన్‌ల షూటింగ్ పూర్తయిన తర్వాత, సెప్టెంబర్ మూడో వారం తర్వాత ఎన్టీఆర్ స్వయంగా షూటింగ్ సెట్స్‌లో జాయిన్ కాబోతున్నట్లు సమాచారం. మరోవైపు, ఎన్టీఆర్ గాయం కారణంగా ఈ సినిమా షూటింగ్ తాత్కాలికంగా నిలిచిపోయిందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలన్నీ పూర్తిగా అవాస్తమని తెలుస్తుంది. దీనిపై కూడా మేకర్స్ క్లారిటీ ఇవ్వవలసి ఉంది.


# రెడ్ డ్రెస్ లో మెరిసిపోతున్న రకుల్

రకుల్ ప్రీత్ సింగ్ గురించి, ఆమె అందం గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తక్కువ టైమ్ లోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు, భారీ ఫాలోయింగ్ ను సొంతం చేసుకున్న రకుల్, ప్రస్తుతం బాలీవుడ్ కు వెళ్లి అక్కడే సెటిలైపోయింది. ఎప్పటికప్పుడు తన గ్లామరస్ ఫోటోలను నెట్టింట షేర్ చేస్తూ, ఫాలోవర్లకు టచ్ లో ఉండే రకుల్ తాజాగా ట్రెండీ లుక్ లో దర్శనమిచ్చింది. ఈ ఫోటోల్లో రకుల్ రెడ్ కలర్ షోల్డర్ లెస్ కాలమ్ ఫ్రాక్ ధరించి ఎంతో అందంగా కనిపించింది. ఈ డ్రెస్ లో రకుల్ ను, ఆమె అందాలను చూసి కుర్రాళ్లు ఫిదా అయిపోయి, వాటిని సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తూ వైరల్ చేస్తున్నారు.



# మొదటి సినిమాతోనే రూ.58 కోట్లు..

## బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తున్న లోకేష్ కనగరాజ్ 'డీసీ'!



కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ హీరోగా అరంగేట్రం చేసిన తొలి చిత్రం 'డీసీ' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ తమిళ యాక్షన్ డ్రామా ఇండియన్ మార్కెట్లో మొదటి రోజు నుంచే మంచి వసుళ్లను రాబడుతున్న సంగతి తెలిసిందే. ఫస్ట్ డేనే రూ. 6 కోట్లకు పైగా వసుళ్లను రాబట్టిన ఈ చిత్రం అనంతరం వరుసగా కలెక్షన్స్‌తో దూసుకుపోతుంది. తాజాగా ఆరో రోజు కూడా బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగించింది. వర్కింగ్ డేస్‌లోనూ ఈ చిత్రం పట్టుసడలించకుండా మంచి వసూళ్లను రాబడుతోంది. కేవలం ఆరో రోజే భారతదేశంలో సుమారు రూ. 5 కోట్లు నెట్ రాబట్టగా, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా కలెక్షన్లు రూ. 58.62 కోట్లకు పైగా చేరుకున్నాయి. వీకెండ్ కల్లా ఈ చిత్రం రూ. 60 కోట్ల మార్క్‌ను దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.'విక్రమ్', 'లియో', 'కూలీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో స్టార్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనగరాజ్, ఈ చిత్రంతో పూర్తి స్థాయి నటుడిగా మారడం విశేషం. ప్రస్తుతం లోకేష్ అల్లు అర్జున్‌తో 'ఏఏ23' ప్రాజెక్ట్‌ను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450